చుక్కల్లో విత్తన ధరలు

- ఆందోళనలో అన్నదాతలు
- పెరిగిన ధరలతో అదనపు భారం
- యాసంగిలో పెరిగిన సాగు



ప్రైవేట్ దుకాణంలో విక్రయిస్తున్న విత్తనాలు

ఇచ్చోడ: విత్తనాల ధరలకు రెక్కలొచ్చాయి. రబీ ప్రారంభంలోనే ధరలు రెట్టింపు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది కురిసిన భారీ వర్షాలకు వానాకాలం సీజనల్ పత్తి, సోయా పంటలు సాగు చేసిన రైతులు రబీకి సన్నద్ధమవుతున్నారు. చాలా మంది రైతుల పత్తి, సోయా పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. ఖరీఫ్ నుంచి గట్కెక్కడానికి కోటి ఆశలతో రబీ సాగుకు సన్నద్ధమవుతుండగా పెరిగిన విత్తనాల ధరలతో అదనపు భారం పడనుంది. సాగునే నమ్ముకున్న అన్నదాతలు తప్పనిసరి పరిస్థితుల్లో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు యాసంగికి సమాయత్తమవుతున్నారు.

భారమైన సాగు..

రబీ విత్తనాలు ధరలు అమాంతం పెరిగిపోవడంతో రైతులకు రబీ సాగు భారమైంది. ఈ ఏడాది జిల్లాలో దాదాపుగా లక్ష 60 వేల ఎకరాల్లో రబీ సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పెరిగిన విత్తనాల ధరలతో రైతులపై అదనంగా ఆర కోటి వరకు భారం పడనుంది.

యాసంగికి ప్రణాళిక సిద్ధం..

జిల్లాలో యాసంగి సీజన్‌లో పంటు సాగుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1 లక్ష 60 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు..

వ్యవసాయశాఖ యాసంగి సాగుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పంటల సాగును బట్టి ఎరువులను అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తోంది. 4 వేల మెట్రిక్ టన్నుల, యారియా, 2 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ముందస్తుగా ప్రభుత్వానికి నివేదిక అందచేసింది. విడతల వారీగా ఎరువులను అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తోంది.

ధరలు ఇలా..

శనగ విత్తనం రకం	గతేడాది ధరలు	ఈ ఏడాదిధరలు
అన్నగిరి 30 కిలోలు	రూ. 2900	రూ. 3100
జాకి ఉన్నత్ 30 కిలోలు	రూ. 2500	రూ. 2700
అంకుర్‌చిరాగ్ 10 కిలోలు	రూ. 1200	రూ. 1350
సురజ్ 25 కిలోలు	రూ. 2500	రూ. 2700
గోధుమ విత్తనాల రకాలు..		
రుచి 20 కిలోలు	రూ. 1300	రూ. 1550
సాగర్–1 20 కిలోలు	రూ. 1100	రూ. 1250

జిల్లాలో యాసంగి సాగు అంచనా..

పంట పేరు	ఎకారాల్లో
శనగ	55 వేల ఎకరాల్లో
జొన్న	75 వేలు
మొక్కజొన్న	20 వేలు
వేరుశనగ	6 వేలు
గోధుమ	4 వేలు

యాసంగికి సిద్ధం

యాసంగికి సర్వం సిద్ధమైంది, చాలా మంది రైతులు శనగ, జొన్న పంటలను వేస్తున్నారు., యాసంగిలో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పంట సాగు కోసం ఎరువులను డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నాం.

– శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో

బేల: ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని ఎంఈవో కోల నర్సింలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభిచారు. విద్యాభివృద్ధి కోసం ఈ గ్రంథాలయం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల చైర్మన్ గోరే బేబీతాయి, హెచ్ఎం సదానందం, సీఆర్పీలు వెంకన్న, రేణుక, విజయ్, మహేందర్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మహాసభ విజయవంతం చేయండి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మహాసభను విజయవంతం చేయాలని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. గురువారం సభకు సంబంధించిన పోస్టర్‌ను బోథ్, సొనాల, కౌఠ(బి), ధన్నూర్ గ్రామాల్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుమ్మరి పోశెట్టి, టీయూటీఎఫ్ అధ్యక్షుడు మండల అప్పాల శ్రీనివాస్ రెడ్డి, బైరి సతీష్ కుమార్, రఘుపతి, శశిధర్ రెడ్డి, సచిన్, నవనీత్, రమేశ్ చందర్, మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్ ఎంఈవోగా పోశెట్టి



కుమ్మరి పోశెట్టి

బోథ్: మండల విద్యాధికారిగా కుమ్మరి పోశెట్టి నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో పీజీ హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను బోథ్ ఎంఈవోగా విద్యాశాఖ నియమించింది. కాగా మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డికి ఆహ్వానం



ఆహ్వానపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 10న జిల్లా కేంద్రంలోని టీటీడీలో టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, మహాసభలకు హాజరు కావాలని సంఘం నాయకులు వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను డీఈవో కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి, సంఘ బాధ్యులు గంగ్రత్ నారాయణ, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచిన్

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలలు, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక పాఠశాలల్లో నాసిరకం గుడ్లు, భోజనం అందిస్తున్నారన్నారు. దీని వల్ల ఫుడ్‌పాయిజన్‌తో పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. పర్యవేక్షణ చేయాల్సిన ఏటీడీవోలు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైన మెనూ ప్రకారం భోజనం అందించేలా చూడాలని కోరారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



సమావేశమైన ఏఎంసీ ప్రత్యేకాధికారి



మాట్లాడుతున్న డీఏవో శ్రీధర్ స్వామి



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని గల గురుసాహెబ్ చంద జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీసీఐ అధికారులు రైతులకు సహకరించాలని అన్నారు. తేమ పేరుతో రైతులకు ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. అధికారులు రైతుల పక్షపాతిగా ఉండాలని అన్నారు. ధరలో కోత విధించవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను, మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అధికారులు, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు కైలాస్‌లు శాలువాతో సత్కరించారు.

ఇంద్రవెల్లి: రైతులు పండించిన పంటల కొనుగోలు విషయంలో తూకంలో, తేమ శాతం పేరుతో మోసం చేయవద్దని ఏఎంసీ కార్యాలయ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో మండలంలోని జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులతో పాటు ఇంద్రవెల్లి, ముత్నూర్, ధనోరా వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. పంటల కొనుగోలు కోసం చేస్తున్న వ్యాపారస్తులు తప్పకుండా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా రైతుల నుండి పంటలను కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి దేవన్న, వ్యాపారస్తులు నత్తుసింగ్, నర్సోడ్‌సింగ్, జ్ఞానసింగ్, కమలాకర్, చింతవార్ దీపక్, ముకేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: సోయా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని జిల్లా వ్యవసాయధికారి శ్రీధర్ స్వామి అన్నా రు. ఇచ్చోడ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోళు చేసిన సోయా వెంటనే ఎగుమతి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు నాణ్యమైన సోయాను మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఆయన వెంట ఇచ్చోడ ఏఈవో సంజీవ్‌నాయక్, మార్క్‌ఫెడ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న నవీన్ శర్మ

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల హక్కుల సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్ శర్మ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించారు. చట్టాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన ఉంటేనే మోసపోకుండా ఉంటారని సూచించారు. వస్తువులను కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. మోసపోతే తమ సంస్థను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, కిరణ్ కుమార్, మల్లేష్, హేమవతి, సురేందర్, వెంకటేశ్, శివ, విశాల్ పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మఠాధిపతి, సభ్యులు

ఆదిలాబాద్: కార్తికమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే కార్తిక దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి స్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ చంద్ర గోపాలకృష్ణ మఠంలో ఉత్సవానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్తీక ఏకాదశి సందర్భంగా పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీపోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, ఉపాధ్యక్షుడు రేణిగుంట రవీందర్, కందుల రవీందర్, సంతోష్, నర్సింలు, సంజీవ్, విజయ్, స్వామి, వేణు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కుచులాపూర్ గ్రామస్తులు

బోథ్: మండలంలోని కుచులాపూర్ శివారులోని శ్రీవేంకటేశ్వర ఆలయం సమీపంలోని వాగుకు వెళ్లే దారిలో సాయినగర్ కాలనీవాసుల కోసం తలపెటిన శ్మశాన వాటిక నిర్మాణ ప్రతిపాదలను వెంటనే ఆపివేయాలని గురువారం కుచులాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ పొలిమేరలో గ్రామదేవత ఉందని ప్రతీ ఏడాది పూజలు నిర్వహిస్తామన్నారు. దసరా ఉత్సవాలను కూడా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఆ స్థలం కాకుండా వేరే చోట శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సోమ భోజరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమోహన్, మల్లయ్య, సిరిపురం దాస్, స్వామి, నారాయణ రెడ్డి, రమేశ్, దత్తు, భిక్క నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట మహాదీక్ష చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ. 26 వేలను చెల్లించాలనే డిమాండ్లతో గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు మహాదీక్ష చేపట్టారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్లుగా గుర్తించి కీర్తించిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పంచాయతీ కార్మికుల పాలిట మరణ శాసనంలా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రమాద భీమా, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు రూ. పది లక్షల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి వైఖరీ వీడనాడి ఈనెల 20లోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డి.గంగన్న, దుబాక రమక్క, నర్సమ్మ టి.గంగన్న, వాగారావ్, రఫీ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టిక వేశారు.. ధరలు మరిచారు



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతీ రోజు పత్తి ధరతో పాటు మరికొన్ని జిల్లాల పత్తి ధరలు అందుబాటులో ఉంచాలి. కానీ ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌లో పట్టిక వేశారు, కానీ అందులో ధరలు రాయడం మరిచిపోయారు. అధికారుల తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మహాయాగం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న 84వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 25వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రోడ్డు ప్రాంతంలో ఎస్పీ ఆఫీస్ ఎదురుగా మహోత్సవం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేయాలి



మాట్లాడుతున్న మరాఠీ మీడియం అభ్యర్థులు

బేల: తెలుగు మీడియంలో చదివి ఇటీవల డీఎస్సీలో అక్రమంగా మరాఠీ మీడియంలో ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులను పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేయాలని డీఎస్సీ మరాఠీ మీడియం అభ్యర్థులు సురజ్, నితేష్, అంకుస్, ప్రమోద్‌లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టుల నియామకంలో డీఎస్సీ జీవోలను జిల్లా విద్యాశాఖ అధికారి పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. నాన్ లోకల్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించకుండానే ఎలా పోస్టింగ్‌లు ఇస్తారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మరాఠీ మీడియంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను పునః పరిశీలన చేయించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పరిశీలన చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌మోహన్

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. గురువారం మండలంలోని బరంపూర్, అర్లి(కె) గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటిని సర్వే చేయించాలన్నారు. అదేవిధంగా సర్వేపై అధికారులు చేయవద్దన్నారు. సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎనిమినేటర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి అర్చన, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

నార్నూర్: ప్రజలకు ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది వ్యాధులపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చేది చలికాలం కాబట్టి వృద్ధులు, చిన్నపిల్లలు, ఆస్తమా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో లక్ష్మి, హెచ్ఈవో రాథోడ్ తులసిదాస్, సుశీల, సూపర్‌వైజర్ చరణ్‌దాస్ పాల్గొన్నారు.

నేడు నుంచి పత్తి కొనుగోళ్లు

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, పొచ్చెర గ్రామాల్లోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభించనున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తిలో తేమ 12 శాతం లోపు ఉండేటట్లు చూడాలన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

బేల: బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రిజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. గురువారం మండలంలోని గణేష్‌పూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. రైతులకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాంకులో తక్కువ వడ్డీతో రైతు నేస్తం, ఇంటి, బంగారు రుణాలు అందుబాటులో ఉన్నాయని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోన్‌కాస్‌కు చెందిన ఆత్రం శంకర్ సహజ మరణం చెందడంతో ఆయనకు రూ.2లక్షల బీమా పరిహారం చెక్కు, పాస్‌బుక్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ డి. రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీల నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా నియమించిన టీచర్లకు గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కళావతి, సుజాత, వెంకటమ్మ, యమున, మమత, నాగలక్ష్మి, శాంతబాయి, విజయ, ముక్త, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారికి మకర తోరణం బహూకరణ



మకర తోరణం అందజేస్తున్న దాతలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మినారాయణ స్వామి వారికి ఆదిలాబాద్‌కు చెందిన నారాయణస్వామి–ఉర్మిళ దంపతులు రూ.15లక్షల విలువైన 13 కిలోల వెండి తోరణాన్ని విరాళంగా ఇచ్చారు. గురువారం ఆలయంలో అర్చకులు, గ్రామస్తులు వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అల్లూరి అశోక్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకటరమణచార్యులు, ధీరజ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.